క్లుప్తంగా

బాలికల గురుకులంలో నేడు స్పాట్ అడ్మిషన్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల లో సోమవారం 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఎస్సీ కేటగిరీలో- 1, బైపీసీలో ఎస్సీ కేటగిరీలో -1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9347444141 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇద్దరు ఏఈఓల బదిలీ

నడిగూడెం : మండలంలోని సిరిపురం, బృందావనపురం క్లస్టర్‌లలో వ్యవసాయ విస్తరణాధికారులుగా పని చేస్తున్న వినోద్, రేష్మా ఇటీవల మోతె మండలానికి బదిలీ అయ్యారు. దీంతో మునగాల మండలంలో పనిచేస్తున్న ఉప్పయ్య సిరిపురం క్లస్టర్ ఏఈఓగా, పెన్‌పహాడ్‌లో పనిచేస్తున్న ఏఈఓ రేణుక బృందావనపురం క్లస్టర్‌కు బదిలీపై వచ్చి సోమవారం విధుల్లో చేరారు.

పీఏసీఎస్‌లో ఫీల్డ్ సర్వే



పీఏసీఎస్ ప్రాథమిక సమాచారాన్ని సాయినీరజ్‌కు అందజేస్తున్న సీఈఓ

మునగాల : తెలంగాణ సహకార సంఘం హైదరాబాద్‌లో కోఆపరేటివ్ డిప్లొమా కోర్సు పూర్తిచేసిన ఎస్.సాయినీరజ్ శిక్షణలో భాగంగా మునగాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గత వారం రోజులుగా ఫీల్డ్ సర్వే చేశారు. పీఏసీఎస్ ప్రాథమిక సమాచారాన్ని సీఈఓ సోమవారం సాయి నీరజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సాయి నీరజ్ మాట్లాడుతూ.. ఈ సర్వేలో సొసైటీ నిబంధనలకు అనుగుణంగా చేసిన, చేస్తున్న వ్యాపారాలు, భవిష్యత్ కార్యాచరణ, మొదలగు అంశాలపై స్వల్ప కాల వ్యవధిలో సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సర్వేలో పొందుపరచిన అంశాలను డిప్లొమా తరగతుల్లో అధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తన సర్వేకు సహకరించిన సొసైటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శివగంగ లిఫ్ట్‌కు నీటి విడుదల



శివగంగ లిఫ్ట్ మోటార్లు ఆన్ చేస్తున్న ఎస్‌ఐ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని వెల్లటూరు శివారులో కృష్ణానదిపై గల శివగంగ ఎత్తిపోతల పథకానికి సోమవారం ఎస్‌ఐ సైదిరెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వెంకట్‌రెడ్డి, ఎం.సీతారెడ్డి, వి.నారాయణరెడ్డి, డి.వెంకటరెడ్డి, కె.అనిమిరెడ్డి, సీహెచ్.రవి, జె.పుల్లయ్య, ఇంద్రారెడ్డి, రామచంద్రయ్య, పి.గోపయ్య, సుందర మల్లేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంకిరెడ్డి, వీరబాబు, టి.సత్యం, వి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం నాయకులు

మోతె : మండల కేంద్రంలో శ్రీకంఠమహేశ్వర గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొడ్డు సాలయ్య, ఐదబోయిన వెంకన్న, హరికృష్ణ, నకిరకంటి మల్లయ్య, ఆంజనేయులు, పెరుమళ్ల వెంకన్న, రవి, నాగరాజు, మల్సూర్, కనకయ్య, నగేష్, సతీష్ పాల్గొన్నారు.

నామమాత్రపు రేట్లకే ఎన్నెస్పీ క్వార్టర్స్ ఇప్పించాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : నామమాత్రపు రేట్లకే తమకు ఎన్ఎస్పీ క్యాంపు క్వార్టర్స్ ఇప్పించాలని రిటైర్డు ఉద్యోగులు కోరారు. ఈమేరకు సోమవారం నల్లగొండ పట్టణానికి వచ్చిన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సీపీఐ మిర్యాలగూడ మండల కార్యదర్శి ఎండీ సయ్యద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డు ఉద్యోగులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. కాగా, సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మోహన్‌రెడ్డి, గంగాధర్, ముత్తిలింగం, అచ్చాలు, రాజారత్నం ఉన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- అడుగడుగునా గుంతలు
- వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు
- నూతన బీటీ రోడ్లు నిర్మించాలని మండల ప్రజల వేడుకోలు



రావికుంటతండా- ఉర్లుగొండ గ్రామాల మధ్య గుంతలమయంగా రోడ్డు

మోతె : మండలంలో లింకు రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కూడలి గ్రామం నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే 20 కిలోమీటర్లు గల రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఈ మార్గంలో గల రావికుంటతండా, ఉర్లుగొండ, కరక్కాయలగూడెం, విభళాపురం గ్రామాల్లో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రావిపహాడ్ నుంచి అప్పన్నగూడెం, అదేవిధంగా బుర్కచర్ల, హుస్సేన్‌బాద్ గ్రామాల నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి. అలాగే నర్సింహాపురం గ్రామం నుంచి తుమ్మగూడెం, నేరడవాయి, గోపతండా గ్రామాలకు వెళ్లే 15 కిలో మీటర్లు దూరం గల రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ప్రయాణికులు పాలేరు హైవే నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్తున్నారు. ఇక సర్వారం నుంచి ఉర్లుగొండకు వెళ్లే రోడ్డు కంకర తేలింది. బీక్యతండా నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లే మెటల్ రోడ్డు పూర్తిగా కంకర తేలి ఉంది. దీంతో ఈ రోడ్డుపై నిత్యం తండాల రైతులు, విద్యార్థులు సైకిళ్లు, బైక్‌లపై ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. భోజ్లతండా నుంచి సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే మెటల్ రోడ్డు సహితం గుంతలమయంగా ఉంది. అయితే ఆయా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలుస్తోంది. కావున సంబంధిత అధికారులు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొత్త బీటీ రోడ్లు నిర్మించాలి

మండల వ్యాప్తంగా రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అధికారులు, ఎమ్మెల్యే పద్మావతి పదే పదే చెబుతున్నారు. కావున తక్షణమే మండల వ్యాప్తంగా కొత్త బీటీ రోడ్లు నిర్మించి ప్రజల సమస్య పరిష్కరించాలి.

– కోట మధుసూదన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త, రావిపహాడ్

చెరువుల కబ్జాను పట్టించుకోని అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలంగాణ మత్స్యకారుల సంఘం, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల కబ్జాతో లక్షలాది మంది మత్స్య కార్మికులు ఉపాధి కూలికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటల కబ్జాపై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువులకు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల్లో మత్స్యకారులకు, రైతుల మధ్య వాగ్వాదం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి కబ్జాలను నిరోధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, నాయకులు మల్లయ్య, శ్రీను, సీతయ్య, నరసింహారావు, రాంబాబు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో రక్షాబంధన్ వేడుకలు



ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటున్న భక్తులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రాఖీలను స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనందరం దేశానికి రక్ష అంటూ ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ నలజాల రామారావు, గట్టికొప్పుల కృష్ణారెడ్డి, ఉదయ్, ప్రకాశం, కొండయ్య, నాగేశ్వరరావు, సాంబ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు



అయ్యప్ప విగ్రహం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాలధారణ భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలో కోటిన్నర రూపాయల వ్యయంతో నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మాలాధరణ భక్తులు, దాతలు, ప్రముఖులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో సాంప్రదాయబద్ధంగా స్వామివార్ల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. వేద పండితులు ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, జొన్నబొట్ల కిశోర్ శర్మ బృందం ముందుగా గణపతి పూజ, మండప హోమాలు తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ మహోత్సవానికి నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి, మిర్యాలగూడ మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. 10 వేల మంది భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు యారవ సురేష్, దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, యడవల్లి సత్యనారాయణరెడ్డి, ఐల శ్రీను, లక్ష్మారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మోతెలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

మోతె : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

25న హుజూర్‌నగర్‌లో గంగమ్మ, పెద్దమ్మ జాతర



ఆలయాన్ని సందర్శిస్తున్న యాదవ కులస్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో యాదవుల ఆరాధ్య దైవం గంగమ్మ, పెద్దమ్మ జాతర్లను ఈనెల 25వ తేదీన జరపాలని నిర్ణయించినట్లు యాదవ పెద్దలు తెలిపారు. సోమవారం ఆయా అమ్మవార్ల మందిరాలను వారు సందర్శించి మాట్లాడారు. జాతరలో యాదవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ పెద్దలు పెద్దగొల్ల జె.నరేందర్, బి.వెంకయ్య, సీహెచ్.వెంకటేశ్వర్లు, జె.అంజి, జె.మల్లయ్య, జె.నాగేశ్వర్‌రావు, జె.శంభయ్య, ఉదయ్, హరికృష్ణ, కొండలు, శ్రీనివాస్, జయరాం, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కోదాడలో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు



గరిడేపల్లి : ఫొటోగ్రఫీ పితామహుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



నేరేడుచర్లలో ఫొటో గ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోదాడ : పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం కోదాడ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరాను కనుగొన్న లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లను కళాకారులుగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మల వెంకన్న, లక్ష్మణ్, నరేష్, ఉపేందర్, వాసు, అల్లాబక్షు, సైదా, ఎస్ఎస్ శ్రీను, నరసింహారావు, వీరబాబు, నరేందర్, ఉపేందర్, శ్రవణ్, మణి తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు డాగురేచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు పగిడి వీరబాబు, ప్రధాన కార్యదర్శి ఆనంత్‌కుమార్, చామకూరి హరీష్, సుంకరి శ్రీనివాస్, నందిపాటి నరేష్, రవి, చందు, భద్రగిరి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు శ్రీనివాసాచారి, పంగ బుచ్చిబాబు, చందమళ్ల చరణ్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, జి.సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్రహం, మనోహర్, వెంకన్న, ఉపేందర్, వినోద్, రాజేష్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెదవీడులో ఫాగింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిసింగ్

మఠంపల్లి : మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ హరిసింగ్ అన్నారు. సోమవారం మఠంపల్లి మండలంలోని పెదవీడు, మట్టపల్లి, రామచంద్రాపురంతండా తదితర గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెదవీడులో దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్‌ను ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాజు, చంద్రశేఖర్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో సూర్యతేజ రైస్ మిల్ యాజమాన్యం 250 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌తరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో బుధవారం వరంగల్‌కు చెందిన మ్యాక్సీ శరత్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు పెన్షనర్లు హెల్త్ కార్డులు వెంట తెచ్చుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



హుజూర్‌నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా అన్నారు. హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం పిచ్చి మొక్కల నివారణకు గ్లైఫోసెట్ ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదాడలో జంధ్యాల పూర్ణిమ వేడుకలు



జంధ్యాలు ధరిస్తున్న పద్మశాలి సేవా సంఘం సభ్యులు

కోదాడ : పట్టణంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జంధ్యాల పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీల కులదైవం మార్కండేయకు విశిష్ట పూజలు చేశారు. అనంతరం పాత జంధ్యాలను తొలగించి కొత్త జంధ్యాలను ధరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సేవా సంఘం సభ్యులు ఐక్యంగా ఉండి ఆచారాలు పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి నాగరాజు, కొంగరి నరసింహారావు, నక్కా చంద్రం, పిండిప్రోలు శ్రీనివాస్, గిరిప్రసాద్, దామోదర్, రత్నాకర్, మట్టయ్య, రాజేష్, నాగులు, బాలాజీ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్ష విధించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ : మహిళలపై అత్యాచారాలను నిరోధించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రభుత్వాలు నిరోధించలేకపోతున్నాయని విమర్శించారు. జూనియర్ వైద్యురాలిపై అమానుషంగా అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులను ఉరితీయాలని ఆమె డిమాండ్ అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై అత్యాచారాలు వేధింపులు జరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగాక హడావుడి చేసే ప్రభుత్వాలు మహిళలపై అత్యాచార సంఘటనలు జరగకుండా ఎందుకు నిరోధించలేక పోతున్నాయో ఆలోచించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కోశాధికారి, డాన్స్ మాస్టర్ కస్తాల వీరబాబు, మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవరం సుజాత, జిల్లా గౌరవ అధ్యక్షురాలు పశ్యా పిచ్చమ్మ, షేక్ మీరాబీ, షేక్ రేష్మ, వడ్లనపు పుల్లమ్మ, జెనిగ వెంకటమ్మ, షేక్ పర్వీన్, నాగలక్ష్మి, శైలజ, నరేష్, రాజేష్, రామకృష్ణ, సీతమ్మ, నాగేంద్ర, భవాని, పి.నాగ హర్షిత, రాజేష్, నరేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా యూటీ వంతెన



చాకిరాల వద్ద యూటీ వంతెనపై దెబ్బతిన్న రెయిలింగ్

నడిగూడెం : మండలంలోని చాకిరాల సమీపాన సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా 127 కిలోమీటర్ వద్ద ఉన్న యూటీపై గల వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనపై ఓ వైపు రెయిలింగ్ దెబ్బతిన్నది. అసలే వంతెన ఇరుకుగా ఉంటుంది దానికి తోడు రెయిలింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆలయానికి విరాళం అందజేత

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయ అభివృద్ధికి సూర్యాపేటకు చెందిన క్షీరసాగర సరోజిని తన భర్త కేటీ బాబురావు జ్ఞాపకార్థం రూ.50,116 విరాళం ప్రకటించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు ఆమె నగదు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణనందా దత్తగురుస్వామి, జాదవ్ సురేష్, రేగట్టి లింగయ్య, నీరుడు వెంకటరత్నం, రాజ్యం, రేగట్టి సత్యనారాయణ, వెంకట్రావ్, లింగమ్మ, పాపయ్య, సహదేవుడు పాల్గొన్నారు.

'డబుల్' కాలనీల్లో వసతులు లేక సతమతం



అప్పన్నగూడెంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నిలిచిన మురుగు నీరు



విభళాపురంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో అధ్వానంగా రోడ్డు

- డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

మోతె : మండలంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మోతె మండలానికి మొత్తం 147 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో మండల కేంద్రానికి 67 డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించగా 7 ఇళ్లు ఇక బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయాయి. విభళాపురంలో 40 ఇళ్లు, అప్పన్నగూడెంలో 40 ఇళ్లను నిర్మించారు.

విద్యుత్ లేక.. నీరు రాక

కాగా, మండలంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో తాగు నీరు, విద్యుత్ సౌకర్యం సరిగా లేదు. ఇళ్ల మధ్య రోడ్లు లేవు. ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించినా పైపులైన్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు మల, మూత్ర విసర్జనకు ఆరుబయటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ఇళ్ల వద్ద మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్లలో వాడుకున్న నీరు ఇళ్ల ముందే నిలుస్తోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కొందరు దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి తీగలు ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను వాడుకుంటున్నారు. మరి కొందరు చార్జింగ్ బ్యాటరీ లైట్ల వెలుగులో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక అప్పన్నగూడెం గ్రామంలో ఇళ్లు లోతట్టులో నిర్మించడంతో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. దోమలు, ఈగలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అంతేకాకుండా పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇటు ఇళ్లను వదులుకోలేక అటు మరమ్మతులు చేసుకునే స్థోమత లేక ఆ ఇళ్లలో జీవిస్తున్నామని ఆయా గ్రామాల ఇళ్ల లబ్ధిదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.